VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 24-02-2024 సంపుటి : 06 సంచిక : 166 పేజీలు : 8 వెల : రూ 3-00

# దేశచరిత్రలో తొలిసారి 31లక్షల మందికి ఇళ్ల పట్టాలు




**ఇళ్ల స్థలాలపై పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తూ డీడ్స్**
**రాష్ట్రంలో పేదలకు న్యాయం జరిగేలా చర్యలు**
**విద్య,వైద్యరంగంలో కీలక నిర్ణయాలు అమలు**
**ప్రకాశం జిల్లాలో ఇళ్లపట్టాల పంపిణీలో సిఎం జగన్**





ఒంగోలు,ఫిబ్రవరి23( విభారె) : లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏపీ సీఎం జగన్ మరింత దూకుడు పెంచారు. వరుస సభలు, సమావేశాలతో హోరెత్తిస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సామాన్యులకు మరింత చేరువ అవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒంగోలులో పర్యటించి స్థానికులు ఇళ్ల స్థలాలపై సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాల పంపిణీ, లబ్దిదారులకు కన్వేయన్స్ డీడ్లు అందజేశారు. చరిత్రలోనే తొలిసారి పేదలకు ఇంటి స్థలాల రిజిస్టర్డ్ కన్వేయన్స్ డీడ్స్ చేస్తున్నామని.. తద్వారా ఇళ్ల స్థలాలపై లబ్దిదారులకే సర్వహక్కులు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు ఎన్.అగ్రహారంలో నిర్వహించిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు ఒంగోలు తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి జగన్ మాట్లాడారు. 31 లక్షల పేదలకు ఇళ్ల పట్టాలను పొజిషన్ సర్టిఫికెట్ల రూపేణా, అన్ డివైడెడ్ షేర్ ప్లాట్ల రూపేణా ఇచ్చే కార్యక్రమం జరిగిందని జగన్ అన్నారు. దేశ చరిత్రలో తొలిసారి 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలను సైతం రిజిస్ట్రేషన్ చేసి అక్కచెల్లెమ్మల చేతుల్లో పెడుతున్నా మని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్ల స్థలా లిచ్చే విషయంగానీ, శాశ్వతంగా మేలు చేసి అడుగులు వేసే విషయం లోగానీ, ఇళ్ల నిర్మాణం విషయంలో గానీ గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడా ఎంత ఉందో గమనించాలన్నారు. మనం చేసే ప్రతి పనీ 58 నెలల కాలంలో వేసిన ప్రతి అడుగూ పేదల జీవితాలు మారాలి, వారి బతుకులు మారాలి, పేద పిల్లలు ఎదగాలి, భవిష్యత్ లో పేదరికం నుంచి బయటకొచ్చే పరిస్థితి రావాలని ప్రతి అడుగూ పడిందని అన్నారు. పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరో న్యాయం ఉండటానికి వీల్లేదని, పేదలకిచ్చే ఇళ్ల పట్టాలను కూడా రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులకు గానీ, ఎమ్మెల్యేలకు ఇచ్చే పట్టాలు గానీ, ఏ నిబంధనలైతే వాళ్లకు పెడతామో అటువంటి నిబం ధనలతో ఇళ్ల పట్టాలను అందించాం సీఎం జగన్ వెల్లడిం చారు. రాష్ట్రవ్యాప్తంగా 17,005 జగనన్న కాలనీ లే అవుట్లు. 60వేల కోట్లతో 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు. రాష్ట్రవ్యాప్తంగా 71,811 ఎకరాల్లో ఇళ్ల పట్టాల పంపిణీ జరుగుతోంది. మౌలిక సదుపాయాల కోసం ప్రతీ ఇంటికి లక్ష ఖర్చు చేశాం. అక్కచెల్లెమ్మలను లక్షాధికారులు కాదు.. మిలియనీర్లను చేస్తున్నాం. ప్రాంతాన్ని బట్టి ఇంటి స్థలం విలువ 2.5లక్షల నుంచి 15లక్షల వరకు ఉంటుంది. ఒంగోలులో పేదల ఇళ్ల కోసం 210 కోట్లతో భూమి కొను గోలు చేశాం. మరో 21 కోట్లతో లేఅవుట్ల అభివృద్ధి చేశాం. ఒంగోలు లో తాగునీటి కోసం రూ.334 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశాం. జగనన్న టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల కోసం రూ.247 కోట్లు ఖర్చు చేశాం' అని తెలిపారు. 58 నెలల మన ప్రయాణంలో ప్రతి అడుగూ కూడా ఒక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చే విధంగా అడుగులు పడ్డాయని మీ బిడ్డగా సంతోషపడుతున్నా. గ్రామానికి, గ్రామ ప్రజలకు, పట్టణ ప్రజలకు అందించే పౌర సేవల విషయంలో, ఇంటింటికీ తలుపు తట్టి అందించే సేవల విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి మనందరి ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. ఈ విప్లవాలకు మూలం.. పేదలకో న్యాయం, పెద్దవారికో న్యాయం అన్న విధానాన్ని ప్రతి అడుగులోనూ మార్చేసేయాలి అనే తపన, తాపత్రయంతో పడిన అడుగు లు అని జగన్ అన్నారు. మొట్ట మొదటి సారిగా పిల్లలు చదువుకుం టున్న చదువుల్లో బైజూస్ కంటెంట్ ను అనుసంధానం చేస్తూ తీసుకొచ్చాం. గవర్నమెంట్ బడుల్లో పిల్లలకు 8 వ తరగతి రాగానే పిల్లల చేతుల్లో ట్యాబ్స్ పెట్టి ప్రయివేటు, కార్పొరేట్ బడులకన్నా ఇంకా గొప్ప స్థాయిలో ట్యాబులచ్చి నడిపిస్తున్నాం. పేద పిల్లలు వెళ్లే గవర్నమెంట్ బడులు మారాయి.

# ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ చర్చలు విఫలం

**యధావిధిగా 27న ఉద్యోగుల చలో విజయవాడ**
**మార్చిలోగా బకాయిలు చెల్లిస్తామన్న మంత్రి బొత్స**



అమరావతి,ఫిబ్రవరి23 ): బకాయిలు తీర్చాలంటూ ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఉద్యోగ సంఘాలతో మంత్రుల బృందం చేపట్టిన చర్చలు మరోసారి విఫలమయ్యాయి. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు సహా ఇంతకు ముందు ఆందోళన సమయంలో మంత్రుల కమిటీ ఇచ్చిన హామీలపై శుక్రవారం ఉద్యోగ సంఘాలతో చర్చించింది. వీటిపై లిఖిత పూర్వక హామీకి ఉద్యోగ సంఘాలు పట్టుబట్టాయి. అలాగే మధ్యంతర భృతిపై కూడా ఎటూ తేల్చకపోవ డంపై ఉద్యోగ సంఘాలు మండిప డ్డాయి. చర్చల అనంతరం మంత్రి బొత్స మీడియాతో మాట్లాడుతూ.. 'మార్చిలోపు బకాయిలు చెల్లిస్తాం. పిఆర్‌సి ఆలస్యమైతే.. ఐఆర్ కోసం ఆలోచిస్తాం. ఛలో విజయవాడను విరమించుకోమని కాగా, పిఆర్‌సి బకాయిలు, పెండింగ్ డిఎలు చెల్లించాలనే డిమాండ్లపై ఈ నెల 27న ఉద్యోగ సంఘాలు ఛలో విజయవాడకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మంత్రి బొత్స చర్చలు జరిపారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో గతంలో ఇచ్చిన హామీలపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన ఉధృతం చేశారు. సీపీఎస్ రద్దు సహా బకాయిలు చెల్లింపు, కొత్త పీఆర్సీ, ఐఆర్ ప్రకటన తదితర డిమాండ్లు నెరవేర్చాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతోంది.

# జగన్ ఇసుక దోపిడీపై పోరాటం

**నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు**
**టిడిపి-జనసేన ఉమ్మడి పోరాటాలు**
**దోపిడీలో జగన్, పెద్దిరెడ్డిలకు జైలు ఖాయమన్న పట్టాభి**

అమరావతి,ఫిబ్రవరి23 ): జగన్ రెడ్డి అక్రమ ఇసుక దోపిడిపై శనివారం టీడీపీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నట్లు ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటిం చారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే టీడీపీ ఇచ్చిన ఉచిత ఇసుకను రద్దు చేసి ఇసుక మాఫియాతో జగన్ రెడ్డి ఐదేళ్లలో రూ. 50 వేల కోట్ల లూటీకి పాల్పడ్డా రని చెప్పారు. ఏపీలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని అక్రమ తవ్వకాల ఫొటోలు, నకిలీ బిల్లు పుస్తకాలు, తదితర ఆధారాలతో సహా కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, ఎన్జీటి నిర్ధారిం చాయని.. అయినా జగన్ రెడ్డి మాత్రం ఇసుక దోపిడిని ఆపటం లేదని మండిపడ్డారు. ఏపీ వ్యాప్తంగా వైసీపీ నేతల కనుసన్నల్లో 500కి పైగా ఇసుక రీచ్‌ల్లో అక్రమంగా అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని చెప్పారు. ఈ అక్రమ ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన కూటమి నేతలు, కార్యకర్తలు ఆందోళనలు నిర్వహిస్తా రని తెలిపారు. ఇందులో భాగంగా టీడీపీ, జనసేన శ్రేణులు ఇసుక రీచ్‌ల వద్ద నిరసనలు తెలపటంతో పాటు వైసీపీ అక్రమ ఇసుక దోపిడికి సంబంధించిన ఫొటోలు, సెల్ఫీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అచ్చెన్నా యుడు అన్నారు. ఇదిలావుంటే ఇసుకాసురుడు జగన్ రెడ్డి.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన దోపిడీకి జైలుకెళ్లడం ఖాయమని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హెచ్చరి ంచారు. శుక్రవారం నాడు టీడీపీ కార్యాలయం లో ఆయన మీడి యాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని అక్రమ ఇసుక తవ్వకాలపై కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఇచ్చిన నివేదికపై జగన్ రెడ్డి, పెద్దిరెడ్డి ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. తన తొత్తు డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ వెంకటరె డ్డితో కలిసి పెద్దిరెడ్డి మీడియా ముందుకొచ్చి నివేదికపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏపీలో జరుగుతున్న ఇసుక దోపిడీని కప్పిపుచ్చుతూ గతంలో వెంకటరెడ్డి ఏకంగా ఎన్జీటికే తప్పుడు సమాచారమిచ్చారని మండిపడ్డారు. తాము 110 రీచ్‌లను పరిశీలిం చామని, ఎక్కడా నిబంధనలకు విరు ద్ధంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదంటూ తప్పుడు సమాచారమిచ్చిన వెంకటరెడ్డి కూడా తప్పించుకోలేరని వార్నింగ్ ఇచ్చారు. ఇసుకాసురుడు జగన్ రెడ్డి మొత్తంగా పాల్పడిన ఇసుక లూఠీ రూ.50వేల నుంచి రూ.60వేల కోట్లని గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజెంటేషన్ ద్వారా చెప్పింది నూటికి నూరుశాతం వాస్తవమని నేడు కేంద్ర అటవీ, పర్యావరణ విచ్చలవిడిగా ఇసుకదోపిడీకి పాల్పడి అడ్డంగా దొరికిపోయారు కాబట్టే తేలుకుట్టిన దొంగల్లా జగన్ రెడ్డి.. పెద్దిరెడ్డి నోరెత్తడం లేదని ధ్వజమెత్తారు. పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి వీల్లేకుండా వేల కోట్ల ఇసుక దోపిడీకి పాల్పడిన జగన్ రెడ్డి పేదవాడా అని నిలదీశారు. తన ఇసుక దోపిడీ కోసం ముఖ్యమంత్రే ఏకంగా ప్రభుత్వ అధికారులతో ఏకంగా ఎన్జీటికే తప్పుడు నివేదికలు ఇప్పించే స్థాయికి వెళ్లారని ధ్వజమెత్తారు.

# భారత ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 23-వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ఖచ్చితమైన నిఘా వుంచి ప్రతి విషయాన్ని నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మోడల్ కోడ్‌ఆఫ్ కండక్ట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్స్, వీడియో సర్వైలెన్స్ టీమ్స్, వీడియో వ్యూవింగ్ బృంద అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో సాధారణ ఎన్నికలు -2024లో భాగంగా ఎంసిసిటీ, ఎస్ఎస్టి, విఎస్టి, వివిటి, ఎఫ్ఎస్టి టీంలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికల్లో ఎస్ఎస్టి, విఎస్టి, వివిటి, ఎఫ్ఎస్టి మరియు ఎంసిసి టీమ్ అధికారుల పాత్ర కీలకమైందని, భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకలను తు.చ తప్పక పాటించి విధులు నిర్వహించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టీంలను ఏర్పాటు చేశామని, జిల్లా స్థాయిలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో పూర్తి అవగాహన పొంది ప్రతి సందేహాన్ని నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో రిటర్నింగ్ అధికారి స్థాయిలో మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక ఆయా టీంల అధికారులు అన్ని విధాల సన్నద్ధమై ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలన్నారు. నిరంతరం ఎస్ఎస్టి, విఎస్టి, వివిటి, ఎఫ్ఎస్టి మరియు ఎంసిసి టీమ్ అధికారులు అప్రమత్తంగా వుండి ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. సివిజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా కాకుండా ఐటీ, ఎన్ఫోర్స్మెంట్ శాఖలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు.ఏ రోజు వచ్చిన ఫిర్యాదులను ఆ రోజే పరిశీలించి రిపోర్టులు ఇవ్వాలన్నారు.జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో శాంతి భద్రతలు పక్కాగా అమలు పరచేందుకు ఎస్ఎస్టి, విఎస్టి, వివిటి, ఎఫ్ఎస్టి మరియు ఎంసిసి టీమ్ అధికారులు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.

# త్రాగునీరు వాడుకుంటే కఠిన చర్యలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 23-నంద్యాల పట్టణ వాసులకు తాగునీరు అవసరముల దృష్ట్యా వెలుగోడు రిజర్వాయర్ నుంచి నం ద్యాల వరకు వచ్చు నీటిని రైతులు అక్రమంగా తరలించిన యడల కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం లో మున్సిపల్ కమిషనర్. పోలీసు శాఖ. కెసి కెనాల్. విద్యుత్ శాఖ వారితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణము నందు త్రాగు నీరు 20 రోజులకు సరిపడు మాత్రమే ఉన్నందున. అందులో భాగంగా కే.సి. కెనాల్ ద్వారా వెలుగోడు రిజర్వాయరు నుండి బోయరేవుల మీదుగా సంతజూటూరు అన కట్ట ద్వారా నంద్యాలకు నీరు విడుదల చేయుచున్నారు. కాని మార్గమధ్యలో రైతులు మోటార్ల ద్వారా సదరు నీటీ అక్రమంగా పంటలకు వాడుకొనుట వలన నంద్యాలకు నీరు చేరడం లేదు. అందుపై, సమీక్ష సమావేశము నందు పోలీసు శాఖ వారు, విద్యుత్ శాఖ వారు, మునిసిపల్ అధికారులు, రెవెన్యూ శాఖ వారు మరియు ఇరిగేషన్ వారు కే.సి. కెనాల్ మీదుగా పెట్రోలింగ్ చేసి నీటి చౌర్యంను అరికట్ట వలసినదిగా జిల్లా కలెక్టరు ఆదేశించారు .కావున, నంద్యాల పట్టణ త్రాగు నీటి అవసరముల దృష్ట్యా రైతులు వెలుగోడు రిజ్వాయరు నుండి నంద్యాల వరకు వచ్చు నీటిని అక్రమంగా తరలించిన యడల మీా పై కఠిన చర్యలు తీసుకొనబడునని తెలిపారు.

# సంపాదకీయం

శనివారం 24-02-2024

## ఆర్థిక గడ్డు పరిస్థితులకు తోడు నిరుద్యోగం

దేశంలో ఆర్థిక గడ్డు పరిస్థితులను గట్టెక్కించే ప్రయత్నాలు సాగడం లేదు. రూపాయి విలువ క్రమంగా పడిపోతోంది. బంగారం, వెండి ధరలు సామాన్యులకు దూరంగా ఉన్నాయి. గృహనిర్మాణరంగం గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిదన్న ధోరణి కొనసాగుతోంది. హైదరాబాద్ లాంటి నగరంలో మధ్యతరగతి వారు కనీసం ఓ ఫ్లాట్ కూడా కొనలేని దుస్థితి ఉంది. పెరుగుతున్న సిమెంట్, ఐరన్, ఇతర సామాగ్రధరలకు తోడు బిల్డర్ల దోపిడీ కారణంగా ప్రజలకు గృహం అన్నది కలలా తయారయ్యింది. ఈ పరిస్థితులను అధ్యయనం చేయడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారు. బియ్యం ధరలు నానాటికి పెరుగుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా బియ్యం ధరలు అదుపులోకి రావడం లేదు. గ్యాస్, ఇళ్లు ఇచ్చాం.. బాత్‌రూమ్‌లు కట్టించాం.. వికసిత భారత్ అంటూ ప్రకటనలతో ఊదరగొడుతున్నారు. క్షేత్రస్థాయిలో బిజెపి నేతలు మోడీ జపం చేయడం తప్ప సమస్యలను అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక ఇవ్వడం లేదు. ఇకపోతే ఉద్యోగాల కల్పన జరగడం లేదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించే కార్యక్రమం చేయడం లేదు. ఐటి ఉద్యోగాలు ఎండమావిలా తయారయ్యాయి. ఎప్పుడు ఊడుతుందో తెలియని ఉద్యోగంతో కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. ఉద్యోగాల తొలగింపులపై కంపెనీలు వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంటోంది. స్వదేశంలోనూ, విదేశంలోనూ వరుసగా ఉద్యోగాలు తొలగిస్తూ పోతున్నారు. ఉద్యోగాలను ఆఫర్ చేసి..తీరా ట్రైనింగ్ పూర్తయ్యాక సగం జీతాలే ఇస్తామంటున్న కంపెనీల నిజాయితీ ఏమిటో తెలుస్తుంది. పెరుగుతున్న ధరలతో మార్కెట్‌లో ఇప్పటికే తీవ్ర సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఉద్యోగుల పట్ల సానుభూతితో వ్యవహరించి ..జీతాలు కొంచెం తగ్గించి లేదా బోనస్‌లు లాంటివి ఇవ్వకుండా వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఉంటే ఆయా కంపెనీల నిజాయితీ నిలిచేది. కానీ ఉద్యోగాలు తొలగిస్తే ఆ కుటుంబాలు ఏమయిపోతాయన్న కనీస ఆలోచన లేకుండా...సామాజిక బాధ్యతను కంపెనీలు విస్మరిస్తు న్నాయి. ఉద్యోగులను తొలగిస్తూ ఐటి సంస్థలు వరుసగా తీసుకుంటున్న నిర్ణయాలు ఆందోళన కలిగిస్తు న్నాయి. ఈ చర్య సమాజంలో తీవ్ర అశాంతికి కారణమవుతుందన్న బాధను పట్టించుకోవడం లేదు. ఆయా దేశాల ప్రభుత్వాలు కూడా వీటిని పట్టించుకోవడం లేదు. ఇకపోతే ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో అధిక సంఖ్యాకులు భారతీయులేనన్న విషయం మరింత కలవరాన్ని కలిగిస్తోంది. ఇంత జరుగుతున్న మనదేశంలో పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదు. అధికారంలో ఉంటూ దోపిడీలకు పాల్పడుతున్నారు తప్ప అభివృద్ధి గురించి, ప్రజల గురించి ఆలోచించడం లేదు. వారిని ఎలా ఆదుకోవాలో అన్న ఆలోచన చేయడం లేదు. ఉద్యోగాలు పోయిన వారికి వారు అండగా నిలుస్తారన్న ఆశా లేదు. ఓ సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 965 కంపెనీలు 1.50లక్షల మందిని ఉద్యోగాల నుంచి తొలగించాయి. 2023లో కూడా ఈ తొలగింపు పక్రియ కొనసాగింది. ఇప్పటికీ తొలగిస్తూనే ఉన్నారు. ఒక్కో నెలలో రోజుకు సగటున 3 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారని అంచనా! అనేక చిన్నాచితక కంపెనీలతో పాటు అమెజాన్, గూగుల్, ఫేస్‌బుక్, ట్విట్టర్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ ఐటి సంస్థలు కూడా ఉద్యోగులను సాగనంపే పక్రియలో పోటీ పడుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది కాలంలో భారతదేశంలో ఉద్యోగాలు పోగొట్టు కున్న టెకీల సంఖ్య 25 వేల దాకా ఉంటుందని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా వివిధ కంపెనీలు తొలగించిన వారిలో 40 శాతం మంది భారతీయులే అని వివిధ సంస్థలు తేల్చి చెబుతున్నాయి. రానున్న రోజుల్లో కోల్పోయే ఉద్యోగాల్లోనూ భారతీయులే అధికంగా ఉంటారని కూడా ఆ సంస్థలు పేర్కొంటున్నాయి. అదే జరిగితే పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు పోగొట్టుకున్న భారతీయ యువత పరిస్థితి గందరగోళంగా మారింది. దీనికితోడు హెచ్1బి వీసాల నిబంధనలు వారి పరిస్థితిని మరింత అయోమయానికి గురిచేస్తున్నాయి. దీంతో వేలాదిమంది భారతీయ యువతీయువకులు దేశం కానీ దేశంలో ఉద్యోగాల వేటలో మునిగిపోయారు. ఇప్పుడిది సమాజంలో అశాంతికి కారణం కానుంది. గుడ్డిలో మెల్లలాగా వీటిలో కొన్ని సంస్థలు ముందస్తు నోటీస్‌తో పాటు, కొంత మేరకు పరిహారం ఇస్తున్నాయి. మరి కొన్ని సంస్థలు అటువంటివేమి లేకుండానే లే ఆఫ్ కాగితాన్ని చేతుల్లో పెడుతున్నాయి. వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇళ్ల దగ్గర పనిచేస్తున్న సిబ్బందిని అత్యవసర సమావేశం పేరుతో ఆఫీసుకు పిలిపిస్తున్న పలు కంపెనీలు తొలగింపు లేఖలను చేతుల్లో పెడుతున్నాయి. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. ఇలాంటి వారికోసం ఏం చేయాలో మన ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. కొత్త ఉద్యోగాల కల్పనతో పాటు, వీరికి భృతి కల్పించడంపై చర్యలు తీసుకోవాలి. ఇది కేంద్రం బాధ్యత మాత్రమే కాదు. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఉమ్మడిగా ఆలోచన చేయాలి. ఉద్యోగాలు వెతుక్కుంటూ వెళ్లి విదేశాల్లో స్థిరపడుతున్నారని భావిస్తున్న తరుణంలో ఇక్కడి వారికి తీరని మానసిక క్షోభను తెచ్చి పెడుతోంది. సంక్షోభ నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. కనీసం భరోసా ఇవ్వడం లేదు. ఆదుకుంటా మన్న ఉపశమన వాక్కులు కూడా రావడం లేదు. పెద్దసంఖ్యలో భారతీయ యువత విదేశాలలో రోడ్డున పడుతున్నా ఇంతవరకు ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. దేశీయంగా కంపెనీలకు భారీగా రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు ఉద్యోగాల తొలగింపుపై కంపెనీలను నిలదీయాలి. కఠిననిబంధనలు విధించాలి. ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత కంపెనీలదే అని స్పష్టంగా తెలియచేయాలి. ఇష్టం వచ్చినట్లుగా తొలగిస్తే వారికి అండగా ఉన్నామన్న విషయం గుర్తు చేయాలి.

## కాంగ్రెస్‌కు మూడో సీటు కష్టమే : సీట్ల సర్దుబాటుపై తగ్గని తృణమూల్

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు విపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో జతకట్టకతప్పదని కాంగ్రెస్ భావిస్తున్నా ఆ పార్టీ ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో తమకు ఐదు స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ పట్టుబడుతుండగా మమతా బెనర్జీ సారధ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అందుకు ససేమిరా అంటోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ రెండు స్థానాల్లో గెలిచిందని ఆ రెండు స్థానాలే కేటాయిస్తామని సీఎం మమతా బెనర్జీ తేల్చిచెబుతున్నారు. ఇక బైనాక్యులర్స్‌తో పరిశీలించినా కాంగ్రెస్‌కు మూడో సీటు ఇవ్వడం కష్టమే అని టీఎంసీ వర్గాలు స్పష్టం చేశాయి. కాంగ్రెస్‌కు రెండు ఎంపీ స్థానాలు కేటాయిస్తూ త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని టీఎంసీ ప్రతినిధి పేర్కొన్నారు. ప్రస్తుతం బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న బెర్హంపూర్, మాల్దా, డార్జిలింగ్, మాల్దా (నార్త్), రాయ్‌గంజ్ స్థానాల కోసం కాంగ్రెస్ పట్టుబడుతోంది. బీజేపీ గెలుపొందిన



పురూలియా స్థానాన్ని కూడా కాంగ్రెస్ కోరుతోందని టీఎంసీ వర్గాలు తెలిపాయి. అయితే బెంగాల్‌లో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా లేరని, అయినా తాను ఆ పార్టీకి రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించి గెలిపిస్తానని ఆఫర్ చేశానని దీదీ చెబుతున్నారు. ఈ ప్రతిపాదనను కాంగ్రెస్ అంగీకరించలేదని, దీంతో వారికి ఇక ఒక్క సీటు కూడా ఇచ్చేది లేదని ఆమె చెబుతున్నారు. కాంగ్రెస్ మాత్రం విపక్ష భాగస్వాములతో జట్టు కట్టేందుకు బెట్టు వీడి చర్చలు జరిపేందుకు మొగ్గుచూపుతోంది. యూపీలో ఎస్పీతో ఆప్‌తో పలు రాష్ట్రాల్లో పొత్తు ఖరారు చేసుకున్న కాంగ్రెస్ తృణమూల్‌తోనూ సీట్ల సర్దుబాటుకు ఆసక్తి కనబరుస్తోంది. మహారాష్ట్రలో శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేతో పొత్తు దిశగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నేరుగా చర్చలు జరుపుతున్నారు.

## బ్లడ్ బ్యాంకుల దందాపై కొరడా.. 9 బ్లడ్ బ్యాంకులకు నోటీసులు జారీ

హైదరాబాద్ లో బ్లడ్ బ్యాంకుల దందాపై కొరడా ఝుళిపిస్తున్నారు డ్రగ్ కంట్రోల్ అధికారులు. పలు బ్లడ్ బ్యాంకుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు పరీక్షల్లో లోపాలున్నట్లు గుర్తించారు. నిబంధనలు పాటించని 9 బ్లడ్ బ్యాంకులకు నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్ లోని పలు బ్లడ్ బ్యాంకుల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న దందాపై డ్రగ్ కంట్రోల్ బ్యూరో రైడ్స్ చేసింది. మలక్‌పేట, చైతన్యపురి, లక్డీకపూల్, హిమాయాత్ నగర్, సికింద్రాబాద్, కోఠి, మెహదీపట్నం, బాలానగర్, ఉప్పల్ ప్రాంతాల్లోని 9 బ్లడ్ బ్యాంకుల్లో డ్రగ్ కంట్రోల్ బ్యూరో అధికారులు తనిఖీలు చేపట్టారు. కొన్ని బ్లడ్ బ్యాంకుల్లో ప్రమాణాలకు తిలోదకాలిచ్చి నాసిరకం పరికరాలను ఉపయోగిస్తున్నట్టు గుర్తించారు. అంతేకాదు, రక్తం సేకరించడం నుంచి పంపిణీ వరకు అనేక అవకతవకలు జరుగుతున్న విషయం గుర్తించారు. 9బ్లడ్ బ్యాంకులకు షోకాజ్ నోటిసులు డ్రగ్ కంట్రోల్ అధికారులు జారీచేశారు. ఈనెల 2న మూసాపేటలోని హీమో సర్వీస్ లాబోరేటరీలో తనిఖీలు నిర్వహించారు డ్రగ్ కంట్రోల్ బ్యూరో అధికారులు. సామర్థ్యానికి మించి నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుడు ఆర్ రాఘవేంద్రనాయక్ అక్రమంగా ప్లాస్మాను నిల్వ చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. న్యూలైఫ్ బ్లడ్ బ్యాంకుల నుంచి బ్లడ్‌ను సేకరించి, ప్లాస్మాను వేరు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. ఈ అక్రమాల్లో భాగస్వామిగా ఉన్న మియాపూర్‌లోని శ్రీకర ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు, దారుషిఫాలోని న్యూలైఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ బ్లడ్ బ్యాంకుల లైసెన్సులను రద్దు చేస్తూ తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ లో ఐపీఎం సహా 76 ప్రభుత్వ, ప్రైవేటు, ఎన్జీఓ బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. ఆయా బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు పలు కార్యక్రమాల ద్వారా దాతల నుంచి సేకరించిన రక్తాన్ని ప్రాసెస్ చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రోగులకు అందజేయాల్సి ఉంది. కానీ హైదరాబాద్ లోని పలు బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. దాతల నుంచి సేకరించిన రక్తంలో 30 శాతం రక్తాన్ని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే కేన్సర్ సహా ఇతర ప్రభుత్వ ఆస్పత్రులకు ఉచితంగా అందజేయాలనే నిబంధన ఉన్నప్పటికీ దానిని బ్లడ్‌బ్యాంకుల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. అయితే సేకరించిన రక్తంలో ప్లేట్ లెట్లు, ప్లాస్మా నిల్వ చేసే సమయంలో లోపాలు ఉండడం వల్ల, రోగులకు పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తరచుగా ఫిర్యాదులు రావడంతో అధికారులు బ్లడ్ బ్యాంకులపై దాడులు చేశారు.




## బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఆత్మహత్య.. కంటతడి పెట్టిస్తోన్న సూసైడ్ నోట్

బాసర, ఫిబ్రవరి 23: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో విషాదం చోటుచేసుకుంది. పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న శిరీష (17) బలవన్మరణానికి పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారం కారణంగా పోలీసులు చెబుతున్నారు. ఈ విషాద ఘటన గురువారం (ఫిబ్రవరి 22) చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దవ్వూరుకు చెందిన తెనుగు శిరీష బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ ఫస్టియర్ చదువుతుంది. బుధవారం తన ఇంటి నుంచి బయల్దేరిన శిరీష గురువారం వర్సిటీకి చేరుకుంది. అదే రోజు రాత్రి హాస్టల్‌లోని తన గది (రూం నెం 117)లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన హాస్టల్ సిబ్బంది బాలికను క్యాంపస్ హెల్త్‌సెంటర్‌కి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందిందని నిర్ధారించారు. శిరీష మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్టు క్యాంపస్ వర్గాలు చెబుతున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శిరీష గదిని పరిశీలించారు. గదిలో లభ్యమైన సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకుని ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శిరీష రాసిన సూసైడ్ నోట్‌లో పలు విషయాలు వెల్లడించింది. తాను ప్రాణంగా ప్రేమించిన బావ ఆకాశ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నట్లు లేఖలో పేర్కొంది. బావ ఆకాశ్ మృతిని తట్టుకోలేకనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో పేర్కొంది. నేను ఇలా చేయడం తప్పని తెలుసు. నన్ను క్షమించండి. మీరు బాధపడతారని తెలుసు. కానీ బావ లేని జీవితం నాకెప్పటికీ శూన్యమే. అందుకే నేను తన దగ్గరికి వెళ్లిపోతున్నా. బావ చావుకు కారణమైన వారిని వదలకండి. అలాగే నా చివరి కోరిక కూడా తీర్చండి. బావ చనిపోయాక చివరిసారి కూడా చూడలేదు. అందుకే నన్నూ బావని దహనం చేసిన చోటే కాల్చండి. ఇదే నా చివరికోరిక. ప్లీజ్ నాన్న. మేము బతికి ఉన్నప్పుడు మేము ఎలాగూ కలిసి ఉండలేకపోయాం. కనీసం చనిపోయాక అయినా కలిసి ఉంటాం. ఎవరికో భయపడి నేను చనిపోవడం లేదు. నాకు బావ ప్రేమ కావాలి. బావ లేకుండా ఉండలేను. నాకు నువ్వు, అమ్మ ఎంతో.. బావ కూడా అంతే నాన్న. తమ్ముడిని బాగా చూసుకో. అమ్మ జాగ్రత్త' అని శిరీష సూసైడ్ నోట్‌లో రాసింది. కుమార్తె రాసిన సూసైడ్ నోట్ చూసి ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఈ విషయం తెలిసి ఉంటే కూతురిని కంటికి రెప్పలా కాపాడుకునే వారం కదా అంటూ వారు విలపించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి.



## స్పెయిన్‌లో భారీ అగ్నిప్రమాదం.. రెండు అపార్ట్‌మెంట్లు దగ్ధం..



వాలెన్సియా: స్పెయిన్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. వాలెన్సియా సిటీలో ఉన్న రెండు అపార్ట్‌మెంట్లలో మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో నలుగురు మృతిచెందారు. 15 మంది అదృశ్యమయ్యారు. క్యాంపనార్ ప్రాంతంలో ఉన్న ఓ 14 అంతస్తుల భవంతిలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ బిల్డింగ్ నుంచి మరో బిల్డింగ్‌కు మంటలు వ్యాపించాయి. బాల్కనీల్లో చిక్కుకున్న అపార్ట్‌మెంట్ వాసుల్ని అగ్నిమాపక సిబ్బంది రక్షిస్తోంది. బిల్డింగ్‌లో ఉన్న వస్తువుల వల్ల వేగంగా మంటలు వ్యాపించాయి. మంటలు అంటుకున్న బిల్డింగ్‌లో 138 ఫ్లాట్లు ఉన్నాయి. దాంట్లో 450 మంది జీవిస్తున్నారు. ఆరుగురు అగ్నిమాపక సిబ్బందితో పాటు మొత్తం 15 మంది గాయపడ్డారు. అయితే వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఆచూకీలేని 15 మంది కోసం వెతుకుతున్నామని వాలెన్సియా మేయర్ మారియా జోస్ కటలా తెలిపారు. దాదాపు 20 మంది అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. బలమైన గాలులు వల్ల మంటలు రెట్టింపు అవుతున్నాయి. క్రేన్ల ఆధారంగా ఫైర్‌ఫైటర్లు స్థానికుల్ని రక్షిస్తున్నారు.

## నావల్నీ కుటుంబాన్ని పరామర్శించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్



రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ సైబీరియన్ పీనల్ కాలనీ జైలులో కొన్ని రోజుల క్రితం అనుమానాస్పద రీతిలో మృతిచెందిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన కుటుంబాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (ఏనీవ ఃతిటవని) పరామర్శించారు. కాలిఫోర్నియాలోని ఓ హోటల్‌లో నావల్నీ భార్య యులియా, కుమార్తె దాశాని బైడెన్ కలిశారు ఈ సందర్భంగా వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నావల్నీ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. కాగా, సైబీరియన్ పీనల్ కాలనీలో ఉన్న నావల్నీ.. గత శుక్రవారం మరణించినట్లు అధికారులు చెప్పారు. జైలులో వాకింగ్‌కు వెళ్లిన నావల్నీ కింద కూలిపడ్డారు. ఆ తర్వాత ఆయన మళ్లీ లేవలేదట. నావల్నీ మరణవార్త విన్న తర్వాత .. ఆ జైలుకు ఆయన తల్లి, లాయర్ వెళ్లారు. కానీ ఇప్పటి వరకు నావల్నీ మృతదేహాన్ని చూపించేందుకు జైలు మార్చురీ అధికారులు నిరాకరించారు. అయితే, నావల్నీ మృతదేహాన్ని దాచిపెట్టారని ఆయన భార్య ఆరోపిస్తున్నారు. తన భర్తను అధ్యక్షుడు పుతిన్ హత్య చేశారని యులియా ఆరోపిస్తున్నారు. ఫ్రీ రష్యా ఉద్యమంపై ఆమె ఓ వీడియోను రిలీజ్‌చేశారు. నరాలను దెబ్బతీసే నోవిచోక్ అనే విషపూరిత ఏజెంట్‌ను తన భర్తపై ప్రయోగించారని, శరీరం నుంచి ఆ విషం వెళ్లే వరకు నావల్నీ పార్థీవదేహాన్ని అప్పగించబోరని యులియా ఆరోపించారు.

## ఒకదానికొకటి ఢీకొన్న 100కుపైగా వాహనాలు.. పలువురికి గాయాలు

చైనాలో ప్రమాదం చోటు చేసుకుంది ఓ హైవేపై దాదాపు వందకు పైగా కార్లు ఒకదానికొకటి ఢీ కొన్నాయి ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. స్థానిక మీడియా నివేదికల ప్రకారం.. చైనాలో ప్రస్తుతం అతిశీతల వాతావరణం నెలకొంది. దీంతో విపరీతంగా మంచు పడుతోంది. సుజౌ నగరంలోని ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా విపరీతమైన మంచుపడింది. రోడ్డుపై వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ క్రమంలో సుజౌ ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో సుమారు 100కి పైగా కార్లు ఒకదానికొకటి బలంగా ఢీ కొన్నాయి. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలు వాహనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాలపాలయ్యారు. రంగంలోకి దిగిన అధికారులు క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రమాదం కారణంగా ఆ రోడ్డుపై కార్లన్నీ చెల్లాచెదురుగా పడటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అధికారులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు.



# రాయచోటి... నీదా... నాదా

కడప, ఫిబ్రవరి 23 కడప జిల్లా రాయచోటి నియోజకవర్గంలో టీడీపీ 2004లో చివరి సారి గెలిచింది. మళ్లీ ఇప్పటి వరకూ గెలవలేదు. గత నాలుగు సార్లు కాంగ్రెస్ తరపున, వైసీపీ తరపున పోటీ చేస్తున్న శ్రీకాంత్ రెడ్డి గెలుస్తూ వస్తున్నారు. అయితే ఈ సారి గెలుపు అవకాశాలు ఉన్నాయనుకున్నారేమో కానీ.. టీడీపీ నేతలు టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారు. ఎవరికి వారు వ్యూహాత్మక రాజకీయాలు చేస్తూ తామే పోటీ చేస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో క్యాడర్ లోనూ గందరగోళం ఏర్పడుతోంది. రాయచోటి తెలుగు దేశం పార్టీ టికెట్ వేటలో టికెట్ వేటలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, గడికోట ద్వారకనాధరెడ్డి, ఆర్,రమేష్‌రెడ్డి, సుగవాసి ప్రసాద్ బాబు ఉన్నారు. చంద్రబాబునాయుడు టికెట్ పట్ల స్పష్టత ఇవ్వకపోవడం గందర గోళానికి దారితీస్తోంది. ఇప్పటివరకు అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌రెడ్డి తనకే టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలకు దగ్గరయ్యేందుక ఆయన కొంత కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఆయనే పోటీ చేస్తారని అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఇతర నేతల పేర్లు తెరపైకి వచ్చాయి. దీంతో రమేష్ రెడ్డి కొత్తగా కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనా ధరెడ్డి టీడీపీలో చేరారు. ఆయన విజయసాయిరెడ్డికి బావమరిది. ఆయన కూడా టిక్కెట్ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అనుచరులు, కార్యకర్తలను సమీా కరించే ప్రయత్నం చేస్తున్నారు. మరో వైపు టీడీపీ టికెట్ తనకు ఇచ్చారనే పేరుతో రాంప్రసాద్‌రెడ్డి సామాజిక మాద్యమాల్లో లీకులివ్వడం, అనుచరులతో బాణాసంచా కాల్చడం వంటివి చేశారు. అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న రమేష్‌రెడ్డి తనను నిర్లక్ష్యం చేయడంపై కినుక వహించి నట్లు సమాచారం. వరుసగా ఆత్మీయ సమావేశాలు నిర్వ హించిన అనంతరం పార్టీ మారతారనే ప్రచారం సాగుతోంది. అయితే పార్టీ మారుతారని వస్తున్న వార్తల పట్ల మాట్లాడుతూ తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, అటువంటి పరిస్థితి ఎదురైతే ఆలో చిస్తానని చెప్పుకొస్తున్నారు.

చంద్రబాబు టికెట్ నిరాకరణకు సోదరుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి కడప ఎంపీగా పోటీ చేయనున్నారు. ఈయన సతీమణి మాధవికి కూడా కడప అసెంబ్లీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబానికి ఎన్ని టిక్కెట్ ఇస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. అన్నమయ్య జిల్లాలో ఆ కుటుంబానికి ప్రాధాన్యమిస్తే రమేష్ రెడ్డికి అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేగా పలుసార్లు ప్రాతినిధ్యం వహించిన సుగువాసి పాలకొండరాయుడు తనయుడు ప్రసాద్ బాబు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు రాయచోటి సీటు అడుగుతున్నారు. ఆయన ఇప్పటికే లోకేష్ బాబును, ఇటీవల పులివెందులలో పార్టీ అధినేత చంద్రబాబును కలసి టిక్కెట్ తనకే కేటాయించాలని కోరినట్లు సమాచారం.

# ఏపీలో కండోమ్ పాలిటిక్స్

విజయవాడ, ఫిబ్రవరి 23 ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది...పార్టీల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీలు, నేతలు క్యాంపెయిన్ చేస్తున్నారు. పోటాపోటీ సభలు, ర్యాలీలతో పొలిటికల్ హీట్ పెంచుతున్నారు. ప్రత్యర్థులపై అవినీతి ఆరోపణలు, విమర్శలు, వ్యంగ్యాస్త్రాలతో ప్రజలకు ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి దాకా బూతు పురాణం రెచ్చిపోయారు. ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. కుటుంబసభ్యులపై అసభ్యంగా మాట్లాడుతూ...రాజకీయాలను దిగజార్చుతున్నారు. తమ ప్రత్యర్థుల పెళ్లిళ్లు, ఎఫైర్లు అంటూ వ్యక్తిగత దూషణలు చేస్తూ... తమ పార్టీ హైకమాండ్ ను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు పెళ్లాలు, ఎఫైర్లు, అంబోతులు, కుక్కలు అంటూ మాట్లాడుకున్న పార్టీలు...మరింతగా రెచ్చిపోతున్నాయి. ప్రత్యర్థులను ఎలాగైనా డ్యామేజ్ చేయాలన్న కసితో అనేక రకాల కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారు. ఏపీ రాజకీయాల్లో కండోమ్ లకు ప్రాధాన్యత పెరిగింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో కండోమ్‌లు ఎన్నికల ప్రచార సాధనంగా మారాయి. నిరోధ్ గురించి మాట్లాడుకోవడమే తప్పుకునే స్టేజ్ నుంచి నిరోధ్ లోనే ప్రచారం షురూ చేశాయి. నీచాతినీచ కామెంట్లపై పరిమితమైన పార్టీలు... ప్రత్యర్థులపై ఏకంగా కండోమ్ ప్యాకెట్లతో టార్గెట్ చేస్తున్నాయి. అగ్గి పుల్ల, కుక్కపిల్ల, సబ్బు బిళ్ల కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు...ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ పార్టీలు కూడా అలాగే వ్యవహరిస్తున్నాయి. ఏపీలో రాజకీయ పార్టీలు మరో అడుగు ముందుకేసి కండోమ్‌లు...రాజకీయ ప్రచారానికి అనర్హం కాదన్నట్లు నిరూపిస్తున్నాయ్, అధికార వైసీపీ, టీడీపీ ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకోవడానికి కండోమ్ ప్యాకెట్లను ప్రచారానికి వాడుకుంటున్నాయి. వాడు, వాడు బాబు, వాడమ్మ మొగుళ్ల కామెంట్లను మించేలా కండోమ్ లతో ప్రత్యర్థులపై దుర్మార్గమైన విషప్రచారం చేస్తున్నాయి. అమ్మఒడి పథకానికి పిల్లల్ని తగ్గించడానికి టీడీపీ వాళ్ల టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో...ఇంటింటికీ కండోమ్స్ పంచుతున్నారంటూ వైసీపీ ప్రచారం చేసింది. కండోమ్ ప్యాకెట్లపై తెలుగుదేశంపార్టీ సింబల్, ఈ ఎన్నికల్లో ఆ పార్టీ స్లోగన్ ను ముద్రించారు. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న వీడియో కాస్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. వైసీపీ కండోమ్ ప్యాకెట్ల ప్రచారంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. వైసీపీకి కౌంటర్ గా టీడీపీ శ్రేణులు... వైసీపీ సిద్ధం పేరుతో కండోమ్ ప్యాకెట్లు పంచుతోందంటూ ప్రచారాన్ని ప్రారంభించింది. వైఎస్ఆర్సీపీ సిద్ధం.. సిద్ధం అని కేకలు పెట్టేది ఇందుకా ? ఇలాంటి నీచపు ప్రచారాలు చేసే బదులు శవాల మీద చిల్లర ఏరుకోవచ్చు కదా అంటూ టీడీపీ శ్రేణులు కొటేషన్లు పెడుతున్నాయి. ఇలా ప్రధాన పార్టీలు సోషల్ మీడియా వేదికగా....ఒకరిపై మరొకరు దిగజారి ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇది కండోమ్‌లతో ఆగిపోతుందా లేదా ప్రజలకు వయాగ్రా చేయడం ప్రారంభిస్తారా ? అన్న చర్చ జరుగుతోంది. ఛీ...ఛీ.. ఏపీ రాజకీయ పార్టీలు ఇంత దిగజారిపోయారా ? ముమ్ముందు ఇంకెంత దిగజారుతారో అన్న చర్చ ప్రజల్లో జరుగుతోంది. ఇలాంటి ప్రచారం ఏదో అనామక అకౌంట్ల నుంచి వేస్తే చిల్లర బ్యాచ్ ప్రచారం అనుకోవచ్చు కానీ.... ఏకంగా పార్టీ హ్యాండిల్ చేసే మెయిన్ అకౌంట్ల నుంచే ఇది జరగడంతో ఇరు పార్టీలపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దిగజారుడుతనం ఇంకా ఏ స్థాయికి వెళ్తుందో అన్న చర్చ కూడా నడుస్తోంది.

# 28న టీడీపీ, జనసేన బహిరంగసభ...

ఏలూరు, ఫిబ్రవరి 23 తెలుగుదేశం పార్టీ, జనసేన ఉమ్మడి ప్రచారానికి సిద్ధమ్యాయి. ఫిబ్రవరి ఇరవై ఎనిమిదో తేదీన తాడేపల్లి గూడెంలో ఉమ్మడి బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించారు. విజయవాడలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీ?కున్నారు. అదే సభా వేదికపై ఉమ్మడి మేనిఫెస్టోతో పాటు సీట్ల సర్దుబాటు ప్రకటన కూడా చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. డ్వాక్రా మహిళలకు రుణమాఫీని ఉమ్మడి మేనిఫెస్టోలో చేర్చే అంశంపై చర్చించారు. తాడేపల్లిగూడెం సభలో కీలక ప్రకటన చేసే అవకాశమున్నట్టు సమాచారం. ఉమ్మడి కార్యాచరణ, మేనిఫెస్టో రూపకల్పన తదితర అంశాలపై చర్చించారు. తెదేపా సమన్వయ కమిటీ సభ్యులు అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, పితాని సత్యనారాయణ, తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. జనసేన నుంచి నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, కొటికలపూడి గోవిందరావు, బొమ్మిడి నాయకర్, పాలవలస యశస్విని హాజరయ్యారు. వలంటీర్ల వ్యవస్థ కట్టడిపై టీడీపీ – జనసేన కూటమి ప్రత్యేక దృష్టి పెట్టనుంది. వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా నియమించాలన్న మంత్రి ధర్మాన వ్యాఖ్యలను టీడీపీ – జనసేన సీరియస్‌గా తీసుకుంది. వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా నియమించొద్దని ఈసీ ఆదేశాలు ఉన్నాయమని కూటమి చెబుతోంది. మంత్రి ధర్మాన వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. సమన్వయ కమిటీ భేటీలో సీట్ల అంశం చర్చకు రాలేదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ సీట్ల అంశాన్ని స్వయంగా డీల్ చేస్తున్నారు. బీజేపీతో చర్చలు.. పొత్తుల అంశం కొలిక్కి వచ్చిన తర్వాత వారు ప్రకటిస్తారని అనుకుంటున్నారు. ఈ చర్చలన్నీ తాడేపల్లిగూడెం సభలోపే పూర్తవుతాయని.. ఆ సభలోనే ప్రకటన ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. గెలవలేనని తెలిసి రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆరోపించారు. వైసీపీ నేతలు మీడియాపై దాడులు చేస్తున్నారు. మీడియా దాడులను ఖండిస్తూ సమావేశంలో తీర్మానం చేశామన్నారు. ఐదేళ్ల పరిపాలనలో వ్యవస్థలన్నీ నాశనం చేశారు. దేశవ్యాప్తంగా మన రాష్ట్ర పరువు తీశారు. ప్రజలు తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పుకోలేకుండా చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చర్చించుకున్నామని.. ప్రతిపక్షాల ఓట్లు చీలకూడదని పవన్ కల్యాణ్ పలుమార్లు చెప్పారని నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పనిచేసుకునే సమయం వచ్చిందన్నారు. అన్ని స్థాయిల్లో కలిసి పనిచేయాలని కార్యకర్తలను కోరుతున్నామని నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు.

# జనసేనలోకి కొత్తపల్లి



ఏలూరు, ఫిబ్రవరి 23 జనసేనలో చేరుతానని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రకటించారు. గురువారం ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్వప్రయోజనాల ఆశించకుండా రాష్ట్ర, దేశ భవిష్యత్తు కోసం ఆలోచించే, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చడంతో జనసేన లో చేరుతానని చెప్పారు. పవన్ కల్యాణ్ గ్రామ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి యువతకు ఆరాధ్య నాయకుడని అన్నారు. ఆయన సొంత సొమ్ము వెచ్చించి కౌలు రైతులకుఆర్థిక సహాయం అందిచరన్నారు. రాజధాని అమరావతి విషయంలో ఆయన పోరాటం ఎనలేనిదన్నారు. రైల్వే జోన్, ప్రత్యేక హౌదా కోసం నిర్మొహమాటంగా పోరాటం చేశారన్నారు. 1989, 94, 99, 2004లో టీడీపీ నుంచి, 2012లో కాంగ్రెస్ నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో టీడీపీ నుంచి మంత్రిగానూ పనిచేశారు. అయితే 2009లో పీఆర్పీ నుంచి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి ముదునూరి ప్రసాద రాజు చేతిలో ఓడిపోయారు. 2014లో సుబ్బారాయుడు తిరిగి టీడీపీలో చేరారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ గా పని చేసారు. ఆ తరువాత 2019లో వైసీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే ప్రసాదరాజుతో విభేదాల కారణంగా పార్టీ వీడారు. గతంలో ప్రజారాజ్యంలో పని చేసిన సమయం నుంచి ఉన్న సంబంధాలతో ఇప్పుడు తిరిగి జనసేనలో చేరాలని సుబ్బారాయుడు నిర్ణయించారు. కొత్తపల్లి సుబ్బారాయుడు నర్సాపురం నుంచి సీటు ఆశిస్తున్నారు. ఇప్పటికే అక్కడ పార్టీ నేత బొమ్మిడి నాయకర్ జనసేన అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. టీడీపీ నుంచి మాధవ నాయుడు, ఎన్నారై కొవ్వలి నాయుడు పోటీ కోసం రేసులో ఉన్నారు. ఈ సీటు పొత్తులో భాగంగా జనసేనకు వెళ్తుందని చెబుతున్నారు .ఇప్పుడు తాజాగా సుబ్బారాయుడు ఎంట్రీతో సీటు పైన చర్చ మొదలైంది. అదే విధంగా విశాఖ, తూర్పు గోదావరిలో పవన్ తమ పార్టీకి దక్కే సీట్లుగా చెప్పిన నియోజకవర్గాల్లో టీడీపీ సీనియర్లు ఉన్నారు. తమ పార్టీ నాయకత్వంతో జనసేనకు కేటాయించే సీట్ల పైన స్పష్టత కోరుతున్నారు. పార్టీ నుంచి అధికారికంగా నిర్ణయం వచ్చిన తరువాత తమ నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొత్తగా చేరే వారికి పార్టీ టిక్కెట్లు ఇవ్వదని జనసేన వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. కొత్తపల్లి సుబ్బారాయుడు టిక్కెట్ షరతు పెట్టి పార్టీలో చేరితే పవన్ ఆహ్వానించరని అంటున్నారు. మొత్తంగా ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధిక మంది నేతలు కూటమి దగ్గరకు చేరుతున్నారు.

# రాజోలులో టీడీపీ, వర్సెస్ జనసేన

రాజమండ్రి, ఫిబ్రవరి 23 పొత్తుల్లో భాగంగా రాజోలు నియోజకవర్గం జనసేనకు కేటాయించారని పవన్ కల్యాణ్ గతంలో ప్రకటించారు. దీంతో అక్కడ జనసేన అభ్యర్థిత్వం కోసం పలువురు పోటీ పడుతున్నారు. మొత్తంగా రేసులో నలుగురు ఉన్నారు. నిజానికి సిట్టింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ జనసేన ఎమ్మెల్యేనే. ఆయన పార్టీలోనే ఉండి ఉంటే ఆయనకే టిక్కెట్ ఖరారు చేసేవారు. కానీ వైసీపీలో చేరిపోయి ఆ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. దీంతో జనసేన కొత్త అభ్యర్థిని పోటీకి పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. రాజోలు నియోజకవర్గం గత ఎన్నికల్లో జనసేన పార్టీ గెలిచిన ఏకైన స్థానం. ప్రస్తుతం రాజోలు నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ పోటీ చేయబోతుందని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ నుండి గెలిచి అధికార వైసీపీ గూటికి వెళ్లిపోయిన ఎంఎల్ఎను తిరిగి అదే జనసేన పార్టీ అభ్యర్థి ఓడించేందుకు రాజోలు నియోజకవర్గంలో జనసైనికులు కంకణం కట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ ప్రకటనతో రాజోలు నియోజకవర్గంలో జనసేన పార్టీలో పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. రాజోలు నియోజక వర్గంలో 2019 జనసేన గెలిచిన స్థానం. ఎస్సి, ఒసి (కాపు) సామాజిక వర్గాని చెందిన ఎక్కువ ఒటర్లు రాజోలులో ఉన్నారు. టీడీపీకి మంచి బలం ఉన్న నియోజకవర్గం అయిన రాజోలులో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పార్టీని చూసుకుంటున్నారు. జనసేన 2019లో జనసేన గెలిచిన స్థానం కావడంతో టీడీపీ ఆశలు వదులుకుంది. గొల్లపల్లి సూర్యారావు తన కుమార్తెను జనసేనలో చేర్చుకుని టిక్కెట్ ఇస్తే గెలుపు ఖాయమని కూటమి నేతలకు చెబుతున్నట్లుగా తెలుస్తోంది. అమూల్య భర్త బిసి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆ వర్గం నుండి మెజారిటీ ఓట్లు తెచ్చుకుంటుదన్న ధీమాను ఆయన వ్యక్తం చేస్తున్నారు. అయితే గొల్లపల్లి కుటుంబానికి టిక్కెట్ ఇస్తే.. నియోజకవర్గం టీడీపీకి ఇచ్చినట్లేనని జనసైనికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నియోజకవర్గ నుంచి మరో ముగ్గురు జనసేన నేతలు పోటీ పడుతున్నారు. రమేష్ బాబు వైద్య వృత్తిలో ఉండి స్వచ్ఛంద సంస్థల ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మూడేళ్ల నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. రాజోలుకే చెందిన రిటైర్డ్ ఐఎఎస్ దేవ వరప్రసాద్ చంద్రబాబు ప్రభుత్వంలో పని చేశారు. ప్రస్తుతం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనవాణి కార్యక్రమాలకు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఆయన కూడా ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరొకరు బొంతు రాజేశ్వరరావు గత ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి అనంతరం జనసేన పార్టీలో చేరారు. తనకే కచ్చితంగా సీటు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. . సీటు అవకాశం దక్కితే గెలవడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయంటూ ఆశావహుల సంఖ్య పెరిగిపోతోంది.

# తిరుమలలో గుప్త నిధుల కోసం తవ్వాలు జరిగాయా...

తిరుపతి, ఫిబ్రవరి 23 గత ఎన్నికలకు ముందు టిడిపి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వచ్చేందుకు చాలా శక్తులు పనిచేశాయి. మేధావి బృందం వైసిపికి అనుకూలంగా పనిచేసింది. ఈ క్రమంలో అప్పటి చంద్రబాబు సర్కార్ పై ఆరోపణలు చేయడంలో ఈ బృందం ముందుండేది. అందులో రమణ దీక్షితులు ఒకరు. చంద్రబాబు ప్రభుత్వం పై ఆయన చేసిన ఆరోపణల గురించి చెప్పాల్సిన పనిలేదు. వాటిని పట్టుకొని వైసీపీ నేతలు ఏ రేంజ్ లో రాజకీయాలు చేశారు ఈ రాష్ట్ర ప్రజలకు తెలుసు. తెలుగుదేశం పార్టీ రమణ దీక్షితులపై పరువు నష్టం దావా కూడా వేసింది. కానీ అధికారంలోకి వచ్చాక ఆ కేసు ముందుకెళ్లలేదు. అయితే వైసిపి ప్రభుత్వం మంచి ఆశించినది దక్కలేదో.. ఇతర కారణం తెలియదు కానీ ఇప్పుడు రమణ దీక్షితులు అదే తరహా ఆరోపణలు వైసీపీ సర్కార్ పై చేయడం విశేషం. అయితే నేరుగా ఆయన విమర్శలు చేయలేదు. ఆయన విమర్శలు లీక్ అయ్యాయి. ముఖ్యంగా టీటీడీ ఈవో ధర్మారెడ్డిని రమణ దీక్షితులు టార్గెట్ చేసుకున్నారు. పరమ పవిత్రమైన తిరుమల క్షేత్రంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు చేశారు. ఈవోగా ఉన్న ధర్మారెడ్డి క్రిస్టియన్ అంటూ ఆరోపించారు. టీటీడీలో చాలామంది క్రిస్టియన్లు ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈవో ధర్మారెడ్డి క్రిస్టియన్. సీఎం జగన్ క్రిస్టియన్ అని దీక్షితులు వ్యాఖ్యానించారు. ధర్మారెడ్డి కుమారుడు చనిపోతే దహనం చేయలేదని.. ఖననం చేశారని.. కనీసం ధర్మారెడ్డి బొట్టు కూడా పెట్టుకోడని దీక్షితులు కామెంట్ చేయడం విశేషం. మరోవైపు టిటిడి అంతర్గత విషయాలపై సైతం దీక్షితులు సంచలన వ్యాఖ్యలు చేశారు. అహోబిలంలో గుప్త నిధులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. రెండు శతాబ్దాల కిందట కొండమీద ఒక గుహలో ఓ జీయర్ లోపలికి వెళ్లి సమాధి అయ్యాడని.. ఆ గుహలో అప్పట్లో విజయనగరం సామ్రాజ్యకాలంలో పెద్ద ఎత్తున నిధులు పెట్టారని చెప్పుకొచ్చారు. దాన్ని బయటకు తీయాలని చాలాసార్లు అహోబిలం జీయర్ దగ్గరికి ధర్మారెడ్డి వెళ్లి వస్తుంటారని కూడా దీక్షితులు చెప్పడం విశేషం. బెంగళూరులో ఆర్కియాలజీలో పురుషోత్తమ రెడ్డి అనే అధికారి ధర్మారెడ్డి మనిషి అని కూడా దీక్షితులు ప్రకటించడం విశేషం. తిరుమలలో ప్రసాదాలు తయారు చేసే కిచెన్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని కూడా రమణ దీక్షితులు ఆరోపణలు చేశారు. నిషేధిత మత్తు వస్తువులు కూడా వినియోగిస్తుంటారని.. తిరుమల ఆలయంలోని పరకామణిలో గ్రానైట్ తీసి తవ్వకాలు చేస్తున్నారని కూడా సంచలన ఆరోపణలు చేశారు. వెయ్యికాళ్ల మండపం, దేవ మండపం.. ఇలా అన్నింటిని నిధుల కోసమే తవ్వారని ఆరోపించారు. అక్కడ ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని కూడా చెప్పుకొచ్చారు. అయితే ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనిపై స్పందించిన రామచంద్ర యాదవ్ నేరుగా అమిత్ షాక్ లేఖ రాశారు. ఈ వీడియో పై వివాదం నెలకొన్న నేపథ్యంలో రమణ దీక్షితులు స్పందించారు.

# గుంతకల్లు టీడీపీ నుంచి జయరామ్...?

అనంతపురం, ఫిబ్రవరి 23 అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిపై ఎడతెగని సస్పెన్స్ కొనసాగుతుంది. కొద్ది రోజుల క్రితం ఓ పోలీస్ అధికారి గుంతకల్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా ఉంటాడంటూ ప్రచారం జోరుగా సాగింది. తాజాగా వైసీపీ మంత్రి గుమ్మనూరు జయరాం గుంతకల్లు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలో నిలుస్తారు అని ప్రచారం ఊపందుకుంది. అంతే కాకుండా తనకు ఆలూరు వైసీపీ టికెట్ రాకుండా చేసిన నలుగురు బ్రదర్స్?ను ఖచ్చితంగా ఓడించి తీరుతానని.. అందులో ఒకరు గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి కూడా ఉండడంతో గుమ్మనూరు శపథం చేసినట్టు కూడా ప్రచారం సాగింది. గత వారం, పది రోజుల నుంచి అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి రేసులో గుమ్మనూరు జయరాం పేరు ప్రధానంగా వినిపిస్తుంది. కర్నూలు జిల్లా ఆలూరు వైసీపీ టికెట్ లేదని అధిష్టానం చెప్పడంతో సైలెంట్?గా ఉన్న గుమ్మనూరు జయరాం చాప కింది నీరులా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఆలూరు నియోజకవర్గానికి ఆనుకునే ఉన్న గుంతకల్?పై గుమ్మనూరు జయరాం కన్నేసినట్లు తెలుస్తోంది. గుమ్మనూరు జయరాం గుంతకల్లు నియోజకవర్గాన్ని ఎందుకు ఎంచుకున్నారంటే, సరిహద్దులో ఉన్న బళ్లారిలో గుమ్మనూరు జయరాం సోదరుడు మంత్రిగా ఉన్నారు. అదేవిధంగా కాస్తో.. కూస్తో బళ్ళారి అదేవిధంగా గుంతకల్లులో ఆయన బంధు వర్గం, సామాజిక వర్గం బలంగా ఉంది. దీంతో మంత్రి గుమ్మనూరు జయరాం గుంతకల్లు టిడిపి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గత కొద్ది రోజులుగా గుమ్మనూరు జయరాం కుమారుడు ఈశ్వర్ గుంతకల్లు టిడిపి నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగితే.. గడిచిన వారం, పది రోజులుగా ఏకంగా మంత్రి గుమ్మనూరు జయరాం గుంతకల్లుకు వస్తున్నారని ప్రచారం జోరందుకుంది. గుంతకల్లు నియోజకవర్గంలో గెలుపోటములు నిర్ణయించేది బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లే. అందులో కూడా ప్రధానంగా 25% ఓటు బ్యాంకు బోయ సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారు. గుమ్మనూరు జయరాం గుంతకల్లు నుండి పోటీ చేస్తే తనకు కలిసి వస్తుంది అన్న కోణంలో పోటీకి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రచారానికి బలం చేకూర్చే విధంగా అటు గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణ రెండు రోజుల క్రితం గుంతకల్లు వచ్చి కొంతమంది సన్నిహితులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. గుమ్మనూరు జయరాం త్వరలోనే గుంతకల్లులో పోటీ చేయబోతున్నారని ఆయన సోదరుడు నారాయణ గుంతకల్లులో ఉన్న బంధువులు, సన్నిహితులకు సంకేతాలు కూడా ఇచ్చారట. అదేవిధంగా గుంతకల్లు నియోజకవర్గానికి ప్రక్కనే ఆలూరు నియోజకవర్గం ఉండడం.. ఆలూరు నియోజకవర్గానికి చెందిన నాయకులు, ప్రజలు గుంతకల్లుతో ఎక్కువగా సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండడం కూడా గుమ్మనూరు జయరాంను గుంతకల్లు వైపు చూసేలా చేస్తుంది. అంతే కాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనంతపురంలో ఏర్పాటు చేసిన సిద్ధం సభకు.. అంతకుముందు ఉరవకొండలో ఏర్పాటు చేసిన సభకు కూడా గుమ్మనూరు జయరాం గైర్హాజరవడం చూస్తుంటే జయరాం టిడిపి తీర్థం పుచ్చుకోవడం దాదాపుగా ఫిక్స్ అయినట్టే తెలుస్తోంది.

# బిజెపి ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

అభిరుచి మధు బిజెపి పార్టీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 23- బిజెపి ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బిజెపి నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో పలు వీధుల్లో ప్రజాపోరుయాత్ర కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కసెట్టీ చంద్రశేఖర్. గంగాధర. బాలన్న రమేష్ బాబు. ఈశ్వర్. ఉపేంద్ర నాథ్ రెడ్డి. బిజెపి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 23-. మహానంది క్షేత్రంలో 6-3-2024నుండి11-3-2024 వరకు జరిగే మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం ఉదయం శాస్త్రీయంగా ఆలయకార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి. మార్కెట్ ప్రసాద్ , పండితులు, అర్చకులు, ఏఈఓ, సూపరింటెండెంట్, టెంపుల్ ఇన్స్పెక్టర్లతో పూజాదికాలతో పూజలు చేసిన అనంతరం మహా శివరాత్రి గోడ పత్రికను స్థానిక శాసనసభ్యుడు శిల్ప చక్రపాణి రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం ఆహ్వాన పత్రికను నంద్యాల పార్లమెంటు సభ్యులుపోచబ్రహ్మానందరెడ్డి కి. నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు నంద్యాలజిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి , డాక్టర్ గడ్డం రామకృష్ణారెడ్డి కి. మహానందిదేవస్థానంకునిత్యం కూరగాయల వితరణ చేస్తున్న మార్కెట్ ప్రసాద్ దంపతులకు అందజేశారు

# శుభ కరణ్ సింగ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- ఫిబ్రవరి 23 యువ రైతు శుభ కరణ్ సింగ్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లంకా సుబ్బారాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతుల ప్రాణాలు తీస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. అఖిల భారత కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు శుక్రవారం స్థానిక బేతంచెర్ల సర్కిల్ రోడ్డులో సిఐటియు,రైతు సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్ అధ్యక్షతన రాస్తారోకో కార్యక్రమం జరిగింది. సిఐటియు మండల కార్యదర్శి ఏవి. భాస్కర్ రెడ్డి,రైతు సంఘం మండల అధ్యక్ష,గౌరవ అధ్యక్షులు బి. నాగమద్దయ్య,కోయిలకొండ నాగరాజు,సిఐటియు నాయకులు చిన్న రహిమాన్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ,హర్యానా సరిహద్దుల్లో రైతు సమస్యలపై ఆందోళన చేస్తున్న రైతులపై బిజెపి ప్రభుత్వం పోలీసులతో నీటి పిరంగులు,టియర్ గ్యాస్, భాష్ప వాయువు,రబ్బరు బుల్లెట్లతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావాలని,రైతులందరికీ రుణమాఫీ చేయాలన్న ప్రధాన డిమాండ్లతో శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్న రైతులపై హర్యానా పోలీసులు దుర్మార్గపు పద్ధతిలో దాడికి పాల్పడడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో 21 ఏళ్ల యువ రైతు శుభకరణ్ సింగ్ తీవ్ర గాయాల పాలై మరణించారన్నారు. రైతాంగ ఉద్యమంపై పోలీసులు చేస్తున్న ధమన కాండను తట్టుకోలేక ఇప్పటికే ఇద్దరు రైతులు గుండె ఆగి మృతి చెందారన్నారు. రైతుల మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని మృతిచెందిన రైతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రన్న,రాము,జబ్బార్,శ్రీను,సుధాకర్,వెంకటేశ్వర్ రెడ్డి,నాగరాజు,నక్కిహరి తదితరులు పాల్గొన్నారు.

# బాయ్ బాయ్ వైకాపా ప్రజల నినాదం

అభిరుచి మధు బిజెపి నంద్యాల అసెంబ్లీ కన్వీనర్





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 23-వచ్చే ఎన్నికల్లో బాయ్ బాయ్ వైకాపా ప్రజల నినాదం అని నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు. రాష్ట్రంలో నే కాకుండా కనీసం నియోజకవర్గంలో కూడా అభివృద్ధి పనులు ఎక్కడ జరగలేదని అభివృద్ధే శూన్యం అని బిజెపి నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు అన్నారు . ప్రజాపోరు యాత్రలో భాగంగా శుక్రవారం నాడు ఆటో నగర్. వెంకటేశ్వర పురం. చాపిరేవుల. బాబుజి నగర్. పాండురంగాపురం. పుసులూరు. మిట్నాల. గుంతనాల యందు కూడలిలో భాజపా నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేశారు ఈ సందర్భంగా అభిరుచి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి బటన్లు నొక్కడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రం ఖజానా దివాలా తీసిందన్నారు. అప్పు చేసి పప్పులు బెల్లాలు మాదిరిగా పంచడం గొప్ప పని కాదన్నారు. సంపద సృష్టించి పంచాలని హితవు పలికారు. జగన్ కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు . ఎక్కడ చూసినా ప్రజలు బిజెపి నాయకులకు పూల మాలలు వేసి ఘనంగా స్వాగతం పలికు తున్నారు . శిల్పా మోహన్ రెడ్డి , రవి చంద్ర కిషోర్ రెడ్డి కి రాజకీయంగా దుష్ట పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. భాజపాకు అవకాశమిస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో నంద్యాలను అభివృద్ధి చేస్తామన్నారు. భాజపా నాయకులు కశెట్టి చంద్రశేఖర్, స్వాతి, గంగాధర్, రామకృష్ణారెడ్డి, గురుబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బంది క్రమ శిక్షణతో విధులు నిర్వహించండి

అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 23-సచివాలయ సిబ్బంది క్రమశిక్షణతో అప్పగించిన పనులను నిర్దేశిత కాల పరిమితిలోగా పూర్తి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు . శుక్రవారం నంద్యాల పట్టణం పలు వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించినప్పటికీ సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ. మరోసారి పునరావృతం అయితే తీవ్ర కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనకు సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలిస్తూ ఫిర్యాదులు నిర్ణీత కాల పరిమితిలోపు స్పందన వినతులను పరిష్కరించడంతోపాటు అప్పజెప్పిన రిజిస్టర్లన్నిట్లో నమోదు చేయాలన్నారు.

# పగిలిపోయిన పైపులను పట్టించుకోని అధికారులు

త్రాగునీటికి పట్టణవాసుల విలవిల



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 23,విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణ వాసులకు తాగునీటి సరఫరా చేస్తున్న పైపులైన్ పగిలిపోయి నీరు వృధాగా పోతున్నా, పట్టణంలో తాగునీటి సమస్య నెలకొని ఉన్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. రుద్రవరం మండలంలోని హరినగరం ఎస్ ఎస్ ట్యాంక్ నుండి కొన్ని గ్రామాలకు మంచినీరు సరఫరా అవుతుంది. గత కొన్ని రోజులుగా పట్టణంలో మంచినీటి ఎద్దడి నెలకొని ఉండడంతో కొన్ని వీధులలోని ప్రజలు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు మాత్రం బోర్లు పనిచేయలేదని చెప్తున్నారే తప్పా త్రాగునీటి సరఫరా చేసే పైప్లైన్ మాత్రం పర్యవేక్షించడం లేదు. నాలుగు వారాల క్రితం ఆళ్లగడ్డకు మంచినీటిని సరఫరా చేసే పైపులైను ముత్తలూరు మెట్ట వద్ద పగిలిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో నీరు వృధాగా పోతోనీది. దీంతో త్రాగునీరు భారీగా వృధా అయిపోతోనీది. మంచినీరు సరఫరా చేసే సంబంధ శాఖ అధికారులు మాత్రం ఏమి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి పగిలిపోయిన పైప్లైన్ కు వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది. లేనిపక్షంలో పట్టణంలో మంచినీటి సమస్య మరింత పెరగడంతో పాటు నీళ్లు మాత్రం వృధాగా పోతోంది.

# రహదారి ప్రమాదాల నియంత్రణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టండి : జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 23-ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకుండా జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం లెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, ఆర్టిఓ జి.వి. శివారెడ్డి, డిఎస్పీలు,మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులుమాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడకుండా నంద్యాల జిల్లా పరిధిలోని శాంతిరాం మెడికల్ కళాశాల, చాబోలు క్రాస్, అయ్యలూరు మెట్ట, ఆళ్లగడ్డ లోని అహోబిలం క్రాస్, ఏవి గోడౌన్స్, బలపనూరు క్రాస్ తదితర జాతీయ రహదారుల్లో రహదారి ప్రమాదాల నియంత్రణకు గుర్తించిన బ్లాక్ స్పాట్లలో పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఎన్హెచ్ అధికారులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వారం రోజులు పూర్తిచేసి సంబంధిత నివేదికలు సమర్పించాలని ఎన్హెచ్ అధికారులను ఆదేశించారు. వై జంక్షన్ నుండి ఐటీసీ వరకు లైటింగ్ లేని కారణంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మూడు రోజుల్లో లైటింగ్ ఏర్పాటు చేసి సంబంధిత ఫోటోలను తనకు పంపాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కుందూ నది, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రద్దీ ప్రాంతాల్లో మూడు రోజుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి ఎస్ సి శ్రీధర్ రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు బిఐఎస్ హెల్మెట్ లనే వాడే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీవో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రహదారి ప్రమాదాల్లో ఎవరివో ప్రాణాలు పోతాయని... మొక్కుబడి రీతిలో అప్పగించిన పనులు చేయకుండా పోలీస్, రవాణా, మున్సిపల్ అధికారులు రహదారి నియంత్రణకు సూచించిన పనులను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో ఒక్క ప్రమాదం కూడా జరగలేదన్న ఆత్మ సంతృప్తి ఎన్ హెచ్ అధికారులకు ఉండాలన్నారు. భద్రతా సమావేశాల్లో సూచించిన అంశాలను ప్రాధాన్యతగా భావించి నెల రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఎంట్రీ, ఎగ్జిట్ గుర్తింపు సూచికలు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల్లో ప్రమాదాల నియంత్రణకు సూచించిన భద్రతా చర్యలు చేపట్టలేదని జాతీయ రహదారుల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ.... ఇలాగే వ్యవహరిస్తే టోల్గేట్ మూసివేతకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. పట్టణంలో ఫుట్ పాత్ లపై దుకాణదారులు ఆక్రమించకుండా పాదాచారులు నడిస్తే రోడ్లపై ప్రమాదాలు నివారించవచ్చని ఇందుకు సంబంధించి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల్లో 8 హైవే పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో గత రెండు సంవత్సరాలతో పోలిస్తే భద్రతా చర్యలు చేపట్టడం వల్ల ప్రమాదాల బారిన పడిన మరణాల సంఖ్యను తగ్గించగలిగామన్నారు.

# రెచ్చగొడితే తాటతీస్తా : భూమా కిషోర్ రెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి ఫిబ్రవరి 23 విభారె న్యూస్ :- నియోజకవర్గం లో బిజెపి కార్యకర్తలను రెచ్చగొడితే తాట తీస్తానని బిజెపి నియోజకవర్గ భూమా కిషోర్ రెడ్డి అన్నారు. ప్రజాపోరులో భాగంగా శుక్రవారం స్వగృహం నుంచి కార్యకర్తలతో ర్యాలీగా వచ్చారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో ఈ ప్రభుత్వ హయాంలో ఆళ్లగడ్డలో ఏమి అభివృద్ధి జరిగిందో చెప్పాలన్నారు. తాగునీటి సాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా వీధిలైట్లు, మురుగు, సిసి రోడ్లు కాలువలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో ఆళ్లగడ్డలో రౌడీయిజం, దోపిడీలు, కబ్జాలు వంటివి పెరిగిపోయాయి అన్నారు. రానున్న ఎన్నికల్లో తాను ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. తనని గెలిపిస్తే రౌడీయిజం, కబ్జాలు, దోపిడీలు నిర్మూలిస్తానన్నారు. అలాంటి వాటికి పాల్పడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. అలాగే నియోజకవర్గంలో ఉపాది కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల వైద్యశాలగా అభివృద్ధి చేస్తానని, అలాగే ప్రతి మండలం కేంద్రంలో ముప్పై పడకల వైద్యశాలను ఏర్పాటు చేస్తానన్నారు. తనలో కూడా భూమా రక్తం ప్రవహిస్తుందని తాను ఎవరికి భయపడేది లేదన్నారు. తనను రెచ్చగొట్టాలని చూస్తే తాట తీస్తానని అన్నారు.



ప్రజాపోరు కార్యక్రమంలో మాట్లాడుతున్న భూమా కిషోర్ రెడ్డి

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**